



కడప : ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు



గ్రామీణ బంద్ ప్రశాంతం

- వెల్లువెత్తిన ర్యాలీలు, నిరసనలు
- కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మూసివేత
- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికుల సమరభేరి
- బిజెపిని గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలి
- వామపక్ష, కార్మిక, రైతు సంఘాల నాయకుల పిలుపు

గ్రామీణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని వామపక్ష రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో కలిసి సిఐటియు, ఎఐటియుసి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు సంయుక్తంగా పెద్దఎత్తున ఉద్యమించారు. కేంద్రంలోని బిజెపి సర్కారు తెచ్చిన మూడు నిరంకుశ వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో రైతులు పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమానికి సంఘీభావంగా చేపట్టిన గ్రామీణ బంద్ జయప్రదమైంది. ఉమ్మడి జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీ కేంద్రాల్లోని సుమారు 66 మండలాల గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు, భారీ ర్యాలీలు నిర్వహించారు. పోస్టాఫీసులు, బిఎస్ఎన్ఎల్, అంగన్వాడీ కేంద్రాల్లో వినతిపత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ పాత బస్టాండ్ నుంచి ఏడు రోడ్లు, గోకుల్ సర్కిల్, వన్ టౌన్ మీదుగా బిఎస్ఎన్ఎల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ముగింపు సభలో వామపక్ష కార్మిక, రైతు సంఘాల, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని పేర్కొన్నారు. ఒకవైపు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసి ప్రజల నెత్తిన భారాలు వేయడమేగాక వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించిన నరేంద్ర మోడీ రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. అదాని, అంబానీలను కుబేరులను చేసి, రైతులను, వ్యవసాయ కార్మికులను అప్పులు పాలు చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్ర విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రుణ ఉపశమన చట్టాన్ని చేయాలన్నారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు పెంచి, వేతనం రూ.600 ఇవ్వాలని పేర్కొన్నారు. కరువు, తుఫాన్ నష్టపరిహారాలను, ఇన్పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని, రైతులందరికీ పంటల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కౌలు రైతులకే, నష్టపరిహారాలు బీమా సౌకర్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి, స్మార్ట్ మీటర్ల బిగించే విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. నిరసన ర్యాలీలో జిల్లా కార్యదర్శిల నాగ సుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడారు. సమ్మెకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, గాలి చంద్ర పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఐటియుసి నగర అధ్యక్షులు మద్దిలేటి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, యువజన సంఘం నగర కార్యదర్శి ఓబులేసు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. **కలసపాడు :** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధి కూలీలు, రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, విజయమ్మ , కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి సుదర్శన్, బేల్దారుల సంఘం పేరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు హుస్సేన్‌పీరా, సల్మాన్, చిన్నప్ప, దళిత పోరాట సంఘం నాయకులు సగిలి రాయప్ప, మహమ్మద్‌బాషా, నారాయణ పాల్గొన్నారు **వేంపల్లె :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక,రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ భారత్ సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట భవన కార్మికులు, ఎఐటియుసి నాయకులు నిరసన చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బళ్లారప్ప రామాంజనేయులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకట్రామ్, సహాయ కార్యదర్శి బ్రహ్మం, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు బాలాజీ, పెద్ద ఎత్తున్న వ్యవసాయ కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** దేశవ్యాప్తంగా భారత్ బంద్‌లో భాగంగా పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వద్ద శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏసుదాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు సిఐటియు నాయకులు విజయ్, సిపిఎం కమిటీ సభ్యుడు ఎ.వినయ్, అబ్రహం, సిఐటియు నాయకులు దస్తగిరి, కమాల్ బాషా, మునిస్వామి, అబ్దుల్, ఎంఆర్‌పిఎస్ నాయకులు రసింహులు, ఎఐవైఎఫ్ నాయకులు ఓబులేసు, ఎఐటియుసి నాయకులు శివమ్మ, కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా శుక్రవారం రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు గ్రామీణ సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సిపిఐ నాయకలు రామయ్య, రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి,ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ఆటో యూనియన్ నాయకులు హరిశేఖర్ ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు శీను హరిత నాగేంద్ర ఇన్సాఫ్ షరీఫ్ మున్సిపల్ సంఘ కార్యదర్శి సాల్మన్‌అద్యక్షులు చంటి రాఘవ గుర్రమ్మ మొహన్ సిఐటియు నాయకులు బాలసుబ్బయ్య నరసింహారెడ్డి పాల్గొన్నారు. **మైదుకూరు:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మైదుకూరు అంకాలమ్మ గుడి నుంచి కడప రోడ్డులోని ఎస్‌బిఐ, పోస్ట్ ఆఫీస్ వరకు వామపక్ష నేతలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ దగ్గర ఏర్పాటు చేసిన ముగింపు సభలో వామపక్ష కార్మిక రైతు సంఘాల ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.షరీఫ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి శివకుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ రాహుల్, డివైఎఫ్ఐ సునీల్, అంగన్వాడీ కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు** : శుక్రవారం సిఐటియు కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహంచారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె. శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షరీఫ్, కార్యదర్శి జి.నాగార్జున, బద్వేల్ రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఓబుల్ రెడ్డి, బాల గురవయ్య, రమణారెడ్డి, ఆంజనేయులు ముస్తఫా, ఇమ్మానీలు, సురేంద్ర రాజు, మహేష్, నరసింహ, బ్రహ్మయ్య సిఐటియు నాయకులు పిసి కొండయ్య, రాజగోపాల్ బ్రహ్మయ్య శ్రీనివాసులు మల్లికార్జున శంకర్ జి. వెంకటరమణ బాబయ్య గంప సుబ్బరాయుడు, సుబ్బారాయుడు ఐద్వా నాయకులు మోక్షమ్మ బాలమ్మ నాగలక్ష్మి, కైరున్ బి, సబ్బలక్షుమ్మా, ఫాతిమా విద్యుత్ యూనియన్ నాయకులు ప్రవీణ్, రవి, అవాజ్ పట్టణ కార్యదర్శి అన్వర్ బాషా పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : ధర్నా నిర్వహిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు



జమ్మలమడుగు : ఎస్‌బిఐ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



బద్వేల్ : ర్యాలీ నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు



మైదుకూరు : కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న శివకుమార్

వేడుకగా రథోత్సవం

జనంతో కిక్కిరిసిన దేవుని కడప

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుమల తొలిగడపగా ప్రసిద్ధిగాంచిన దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన అఖిలాండ నాయకుడు కడప రాయుడు కొలువు దీరిన రథాన్ని భక్తులు పోటీపడి ఊరేగించారు. రథోత్సవం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. దేవుని కడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కిక్కిరిసిన జనసంద్రం నడుమన శ్రీవారి రథోత్సవం రంగరంగ వైభోగంగా ప్రారంభమైంది. తొలుత టెం కాయ కొట్టి రథోత్సవాన్ని ముందుకు సాగించారు. తేరుపై గంభీరముద్ర సుందర స్వరూ పులైన ఉత్సవమూర్తులను ప్రజలు తనివితీరా తిలకించి పులకించిపోయారు. రథం ముందుకు సాగుతుండగా భక్తులు గుమ్మడి కాయలు రథచక్రాల కింద ఉంచి మొక్కులు తీర్చు కున్నారు. దేవునికడపలో ఘనంగా రథ ఊరేగింపు అనంతరం శ్రీవారి తేరు తిరిగి తన నిజస్థానంలో నిలిచింది. **కడప రాయుడి సన్నిధిలో ఉపముఖ్యమంత్రి..** దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. పండుగలు, ఉత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలను నలుదిక్కులా పరిమళింపజేస్తాయని ఆయన అన్నారు. **చెన్నూరు :** స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి(కోట్ల స్వామి), సరస్వతినగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి కళ్యాణం వేద పండితులు వేడుకగా నిర్వహించారు. కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బిసి నాయకుడు నిత్య పూజయా రవీంద్రనాథ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి చర్ల సురేష్ యాదవ్, దిలీప్ కుమార్‌రెడ్డి, మొదటి సుబ్బారెడ్డి, అన్వర్, టి ఎన్ చంద్ర రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం యువ నాయకులు చైతన్య రెడ్డి వెంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు. ఆయన వెంట ఇంద్ర రెడ్డి శివారెడ్డి, కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, చెన్నయ్య, లక్ష్మీనారాయణ, ఓబుల్ రెడ్డి ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కడప కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నిర్వహించే 10వ, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో కడప కెవి విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కెవి విద్యార్థులకు హార్స్ రైడింగ్ (గుర్రపు స్వారీ)లో శిక్షణను కూడా అందించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కేవలం పాఠ్యాంశాలపైనే కాకుండా.. క్రీడా, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులను ప్రోత్సహించి శారీరక, మానసిక వికాసాన్ని పెంపొం దించాలన్నారు. ఇ-క్లాస్‌రూమ్‌ల నిర్వహణ ఖచ్చితత్వంగా కొనసాగాలని, అందుకు సంబ ంధించి ఇంటరాక్టివ్ ప్యానెల్ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. భవన నిర్వహణ, మరమ్మతులు, విద్యాలయ పురోగతికి చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాలయంలో కడప నగర పాలక సంస్థ నుంచి తాగునీటి కనెక్షన్, విద్యాలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు, విద్యాలయ స్టాఫ్ క్వార్టర్స్ అవసరాన్ని బట్టి రోజువారీ నీటి అవసరాలను తీర్చడానికి అదనపు బోర్ వెల్ ఏర్పాటుకు కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. అంతకుముందు అకాడమిక్ కార్యకలాపాల గురించి ప్రిన్సిపల్ మునేశ్ మీనా కలెక్టర్‌కు వివరించారు. త్వరలో ప్రారంభం కానున్న సిబిఎస్ఇ బోర్డు థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులు హేమాంగ్ వెంకటేష్, ప్రభాకర్ నాయుడు, ఐడిపిఎస్ ప్రధాన ఆచార్యులు హరికృష్ణ, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు రవి కుమార్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మునేశ్ మీనా, ఇంగ్లీషు, ఫిజిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

యురేనియం పరిశ్రమ పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మలపల్లి ఉన్న యురేనియం కర్మాగారం వ్యర్థ పదార్థాల పైపులైన్ లీకేజీ కావడంతో వ్యర్థపదార్థాలు పొలాలు, బహిరంగ ప్రదేశాలలోకి రావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థపదార్థాల విషయంలో యుసిఐఎల్ నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని మరోసారి నిరూపితమైంది. వ్యర్థదార్థాలు బహిరంగ ప్రదేశాలలోకి రావడంతో నీరు భూమిలోకి ఇంకి నీరు కలుషితం కావడం వల్ల అనారోగ్యాలు కల్గుతున్నాయని, పంటలకు వైరస్ సోకే ప్రమాదముందని రైతులు యురేనియం అధికారులకు పలుమార్లు హెచ్చరించిన వ్యర్థ పదార్థాలు విషయంలో పరిష్కారం చూపలేకపోతున్నారన్నారు. పదేపదే పైప్‌లైన్ లీకేజీలు కావడం పరిపాటిగా మారుతోంది. శుక్రవారం యుసిఐఎల్ నుంచి టైలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్ లైన్ లీకేజీ అవడంతో వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. గమనించిన కొందరు రైతులు యుసిఐఎల్ అధికారులుకు తెలిపారు. అప్రమత్తమైన అధికారులు పైప్‌లను మరమ్మతులు చేసి లీకేజీ అయిన యురేనియం వ్యర్థాలు బయటకు కనిపించకుండా కన్జర్వేటర్ సాయంతో ఆ ప్రదేశాన్ని క్లీన్ చేయించారు. టైలింగ్ పాండ్ పరిహారాన్ని యుసిఐఎల్ గాలికి వదిలేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంటలు, పశుసంపద పూర్తిగా నాశనం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి వ్యర్థ పదార్థాలు లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సంస్కరణలు ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ సంస్కరణలు ఆపాలని విద్యుత్ భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు పి. సుదర్శన్ రెడ్డి, ఎన్. శివశంకర్, పి.సి. కృష్ణ య్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని, లేకుంటే విద్యుత్ రంగ సంస్థలు, వినియోగదారులు, రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలో బ్యూరోకార్ట్ల సంపద పెరిగిపోతోందని తెలిపారు. విద్యుత్ సంస్థలు దివాలా తీస్తున్నా యని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో కోటీశ్వరులు మిలీయనీర్లుగా, మిలియనీర్లు, బిలియనీర్లు ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం విధానాలు తీసుకొ స్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న లేబర్ చట్టాలను మార్చి బడా కార్పొరేట్ కంపె నీలకు బానిసల్లాగా పని చేసే విధంగా మార్పులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలో ట్రై పార్టీ అగ్రిమెంట్ ప్రకారం ఒకే రకమైన సర్వీస్ రెగ్యులేషన్స్ ఉండాలని, ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు సర్వీస్ రెగ్యులేషన్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణ వల్ల విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుల వ్యవస్థ ఏర్పడిందని, వారు శ్రమ దోపిడీ గురవుతున్నారని, వీరిని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.వి. సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు మహిళ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

ఆ మూడు బిజెపికి తొత్తు పార్టీలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపికి బానిసలుగా మారినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి పార్టీకి మూడు పార్టీలు కీలు బొమ్మలుగా మారడం శోచనీయం అన్నారు. రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని చెప్పారు. ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టి రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందన్నారు. కడప జిల్లా స్టీల్ ప్లాంట్‌కు స్వప్తి పలికిందని చెప్పారు. దుగ్గరాజపట్నం ఓడరేవు, పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును విక్రయి ంచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బిజెపికి ఏ మాత్రం బలం లేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ గాని బలం లేని, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపి కోసం వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పాకులాడడం సిగ్గుచేటని విమర్శించారు. బాసిన అవడమేగాక రాష్ట్ర ప్రజలను కూడా బానిసలుగా తయారు చేస్తుడడం దుర్మార్గం అన్నారు. ప్రాంతయ పార్టీలకు ప్రత్యేక హోదా తెచ్చే శక్తి లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో మూడు పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు.

డ్రాయింగ్ పోటీలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాసాగర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే డ్రాయింగ్ పోటీలు విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం అంజాద్ బాష, ఆర్థోపెడిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీ లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యాసాగర్ ఆస్పత్రిలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రోల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్ ఫ్యూచర్' అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి 11 30 గంటల వరకు సమయం ఇస్తామని పేర్కొన్నారు. పాల్గొనేవారు అరగంట ముందు సెంటర్‌కు చేరుకోవాలని తెలిపారు. పోటీలు బాలాజీ నగర్‌లో ఉన్న ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో ఉంటాయని చెప్పారు. పోటీలలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు, ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు కింద ఒకొక్కరికి రూ. వెయ్యి రూపాయలు ఇస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు పేర్లను 9441035961 ,9966563492 నంబర్లకు ఫోన్ చేసి ఈనెల 17 లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

'జగనన్న తోడు' లక్ష్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తి వ్యాపారుల ఆర్థిక బలోపేతం కోసం ఎంతో ప్రధాన్యతో అమలు చేస్తున్న 'జగనన్న తోడు"పథకం 9వ విడత లక్ష్యాన్ని చేధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 'జగనన్న తోడు' లక్ష్యంపై డిఆర్‌డిఎ, మెప్మా, బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9వ విడతలో 10, 290 మంది చిరు వ్యాపారులకు రూ. 10.29 కోట్ల 'జగనన్న తోడు' రుణ లక్ష్యాన్ని ఆయా బ్యాంకులకు నిర్దేశించామని చెప్పారు. అందుకు అన్ని బ్యాంకులు కూడా సహకారం అందించాలన్నారు. మండలం వారీగా ఆయా బ్యాంకు శాఖలకు కేటాయించిన రుణ లక్ష్యాన్ని ఈ నెలలోపే పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండా నిరుపేద చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తివ్యాపారులకు ఆర్థిక సహాయంగా రూ. 10,000 లను 12 నెలవారీ వాయిదాలలో చెల్లించే విధంగా బ్యాంకుల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రుణాన్ని అందజేస్తుందన్నారు. ఈరుణంపై వడ్డీని కూడా రాష్ట్ర ప్రభుత్వం లబ్దిదారునికి పూర్తిగా రీయింబర్స్ చేస్తుందన్నారు. షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా రుణం, వడ్డీని తిరిగి చెల్లిస్తే లబ్దిదా రులందరికీ, రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కొత్త రుణాలను సులభంగా మంజూరు చేస్తుందని చెప్పారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి పొదుపు సంఘాల పటిష్ఠతతోనే సాధ్యం అవుతుందన్నారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా పీడీ సురేష్ రెడ్డి, ఎల్‌డిఎం దుర్గా ప్రసాద్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ ఉద్యోగి సుబ్రహ్మణ్యం మృతికి సంతాపం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం సెక్యూరిటీ ఉద్యోగి ఎం.సుబ్రహ్మణ్యం గుండెపోటుతో ఆకస్మిక మృతి పట్ల యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఘన నివాళులర్పించారు. వైవీయూలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జిప్రిన్సిపల్ ఆచార్య పి.ఎస్. షావలి ఖాన్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాలలో బాధ్యతలు నిర్వర్తించి గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారని తెలిపారు. నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించే ఆయన మృతి వైవీయూలో ప్రతి ఒక్కరిని ఆవేదనకు గురి చేసిందన్నారు.

రేపు ఓపెన్ చెస్ టోర్నమెంట్

కడప : నగరంలోని మస్తాన్ వల్లి వీధిలో ఉన్న హాల్ ఆఫ్ చెస్‌లో మూడవ వైఎస్ఆర్‌డిసిఎ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఈనెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుండి 10 స్థానాలు సాధించిన వారికి ట్రోఫీలు, బెస్ట్ ఉమెన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కు ట్రోఫీ, బెస్ట్ వెట్రన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌కు ట్రోఫీ, వివిధ ఏజ్ కేటగిరి వారికి మెడల్స్, అందరికీ సర్టిఫికెట్లు బహుమతులుగా అందించనున్నట్లు తెలియజేశారు.



ప్రారంభానికి వైద్య కళాశాల సిద్ధం

- అందుబాటులోకి రానున్న నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని కడపరోడ్డు బెస్తవారిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. కళాశాల ప్రారంభమైతే పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్యంతో పాటు విద్యార్థులకు అందుబాటులోనికి రానుంది. 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలను నెలకొల్పారు. అధునాతనమైన పరికరాలతో కళాశాలను నిర్మించారు. కళాశాలలో మొదట సంవత్సరం 100 సీట్లు కేటాయిస్తారు. ఈనెల చివరి వారంలో ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి చేత ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. **అందుబాటులోకి రానున్న మెరుగైన వైద్యం..** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో వైద్య కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి మెరుగైన వైద్య సేవలు అందించడానికి నిపుణులైన వైద్యులతో పాటు నాణ్యమైన వైద్య పరికరాలను అందుబాటులోకి తేనున్నారు. కళాశాలకు కావాల్సిన అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులను నియమించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తుంది.

విషాహారం తిని 10 మేకలు మృతి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెలో రైతు మద్దూరు దస్తగిరికి చెందిన పది మేకలు విష ఆహారం తిని మృత్యువాత పడ్డాయి. మేకలు ఆహారం కోసం ముఖండ ప్రాంతానికి వెళ్లగా అక్కడ విషంతో కూడిన ఆహారం తినడంతో అక్కడికక్కడే 10 మేకలు మృతి చెందాయి. దీంతో రైతు దస్తగిరి కన్నీటి పర్యంతమయ్యారు. విష ఆహారం కారణంగా మృత్యువాత పడిన మేకలకు పరిహారం అందించి అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ముద్దనూరు : ఎన్నికల సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సిఐ దస్తగిరి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ పార్టీలకు చెందిన వారు సంయమనం పాటించాలన్నారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయా పార్టీల సమావేశాలు తరువాత పార్టీల జెండాలు తొలగించాలని సూచించారు. లేని పక్షంలో ఆయా సచివాలయాల కార్యదర్శులు, మహిళా పోలీసులు పార్టీల జెండాల తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాలీలు,రాస్తారోకోలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఎంపిపి గడ్డం జనార్ధన్‌రెడ్డి మృతి

- పలువురు ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



రాజంపేట ఎమ్మెల్యే మేడా అనుచరుడు, ఒంటిమిట్ట ఎంపిపి గడ్డం జనార్ధన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతితో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హైదరాబాదులో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన మారయ్యగారిపల్లెకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, మిత్రులు, బంధువులు, మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మేడా మల్లి కార్జునరెడ్డి, పెన్నా సిమెంట్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డితోపాటు పలువురు ముఖ్యనాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -ఖాజీపేట

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని, రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ తిరిగి పట్టం కట్టాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెముళ్లపల్లె గ్రామంలో శ్మశాన వాటికకు రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, నియోజకవర్గం సమన్వయకర్త శెట్టిపల్లిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి అబూబకర్ సిద్ధిక్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే ప్రజలందరూ పటం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ రెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ బుజ్జి, చెన్నముక్కపల్లె సర్పంచ్ చంద్రశేఖర్ , కొత్తపేట గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

క్రైం కార్నర్

102 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ముతుకూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 102 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చాంద్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముత్తుకూరులో డిఎస్‌పి వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు కానిస్టేబుల్‌తో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా మాచనూరు వెంకటరమణ వద్ద మద్యం బాటిళ్లు నిల్వ ఉన్న విషయం బయట పడిందని చెప్పారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి వెంకటరమణను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం బాటిళ్ళను నిల్వ ఉంచుకుని విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. దాడుల్లో కానిస్టేబుల్ వీరన్న, మహమ్మద్ అలి, మహేష్ పాల్గొన్నారు.

గాయపడిన మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కోడూరు మాజీ సర్పంచ్ శిరిగిరెడ్డి సునంద శివారెడ్డి (48) సోమవారం బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందారు. సునంద, ఆమె భర్త శివారెడ్డి ఇరువురు రెండు పర్యాయాలు కోడూరు సర్పంచుగా పనిచేశారు. విషయం తెలుసుకున్న జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, యూనియన్ నాయకులు మూలె రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మల్లు గోపాల్ రెడ్డి, పలువురు మండల నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.

సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న హౌసింగ్ పట్టాల రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ అసైన్డ్, చుక్కల భూములు, మూడవ దశ రీ సర్వే, పంచాయతీ రాజ్ ఎన్ఆర్ఈజిఎస్ (నరెగా), రబీ పంటలు, తాగునీరు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి నుంచి కలెక్టర్‌తోపాటు జెసి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరయారు. విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, అధికారులను ఆదేశించారు .జిల్లాలో మూడవ దశ రీ సర్వేను పకడ్బందీగా ఎక్కడ పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలోని అన్ని హౌస్ హోల్డ్స్‌కు కొళాయి కనెక్షన్ అందించామన్నారు. వివిధ అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ యదు భూషణ్ రెడ్డి, డిఎంహెచ్ఓ నాగరాజు, సిపిఓ వెంకటరావు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'పుత్తా'

ప్రజాశక్తి- వల్లూరు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుత్త నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదినిమ్మాయపల్లి, కొత్తగాలవారిపల్లిలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ఇచ్చే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్లారు. సంక్షేమ పథకాలకు కేరాఫ్ టిడిపినే అని తెలియజేశారు. మహిళ భద్రత ఆర్థిక స్వాలంబన కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 1500 రూపాయలు ఇస్తామని, ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ప్రతి ఏడాదీ రూ. 15 వేలు అందజేస్తామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ. 3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని తెలియజేశారు. రైతే దేశానికి వెన్నెముక అంటూ ప్రతి రైతుకు ఏటాకు రూ. 20వేల ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు కొత్త చైతన్య రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి, తాడిగోట్ల రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కె. శ్రీనివాసుల రెడ్డి, చల్లా సునీల్ రెడ్డి , గడికోట సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రామ సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి , రఘునాథ్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి , నాగ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బరాయుడు, ఓబులేసు చిట్టిబాబు, సద్దాం హుస్సేన్ , టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాల పంచాయతీలో చంద్ర బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, భూమయ పల్లె సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, రామసుబ్బయ్య, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు ఫరూక్ అహ్మద్, గోవింద్ సుబ్బయ్య, సరిటాల వీరయ్య, పిచ్చి నాయుడు, మిరపకాయలు సుబ్బిరెడ్డి, శోకన్న, పాపిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, అంకాల్ యాదవ్, హబీబ్, త్రిపురవరం హరినాథ్ రెడ్డి, ఖాజీపేట ఎంపీటీసీ చంద్ర భాస్కర్ రెడ్డి, పత్తూరు ఉపసర్పంచ్ ముత్తూరు రమణ, తుట్టే రాము యాదవ్, కమ్మా నరసింహులు, బండి చిన్న, దాసరి శ్రీనివాసులు యాదవ పాల్గొన్నారు.



వల్లూరు : మినీ మేనిఫెస్టో పత్రాన్ని అందజేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

ప్రజల ఆస్తులను కాపాడేది నేనే : 'రాచమల్లు'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రజల ఆస్తులను కాపాడేది తానే అని, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వాహా చేస్తారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. 'రాచమల్లు భూ ధందా'అని పట్టణంలో పలు చోట్ల ఫ్లెక్సీలు వెలియడంతో ఇందుకు సమాధానంగా విలేకరులను సదరు స్థలం వద్దకు తీసుకెళ్లి ప్రత్యక్షంగా మాట్లాడారు. తాను స్వాహా చేసిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా అని బహిరంగంగా ప్రశ్నించారు. తన ఇంటికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి 3.97 ఎకరాలు ఉందని అన్నారు. గతంలో ఈ ప్రాంతం అంతా కంపచెట్లతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉండేదని స్థానికులు బహిర్భూమికి వినియోగిస్తూ ఉండడంతో పందుల విషసర్పాల సంచారం ఎక్కువగా ఉండేదని అన్నారు. ఇదే ప్రాంతంలో చిన్నపిల్లల పాఠశాల కూడా ఉందన్నారు. పరిస్థితిని గమనించి స్థానికుల కోరిక మేరకు తాను ప్రతి ఆరునెలలకోమారు రూ.50వేలు సొంత నిధులు వెచ్చించి శుభ్రం చేయిస్తూఉంటానన్నారు. దేవాదాయశాఖ వారికి తెలిపినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో తాను ఇటీవల రూ.3లక్షలు సొంత నిధులతో గ్రావెల్ తోలించి రోడ్డులాగా అందంగా తయారు చేశామన్నారు. తన రాజకీయ ప్రత్యర్థులు ఫ్లెక్సీలు వేసినట్లు భూధందా కాదని ప్రజల ఆస్తిని ప్రజల కోసం రక్షించడం అన్నారు. 25 సంవత్సరాల కిందట ఇదే స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అల్లుడు రామచంద్రారెడ్డి, వరద అనుచరుడు బాతుల సుబ్బరాయుడు ప్లాట్లుగా వేసి అమ్మకానికి యత్నించి రూ.3కోట్లు దండుకున్నారని పేర్కొన్నారు. అటువంటి వారే ఇప్పుడు ధర్నా చేస్తాం అని అంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లవుతుందని విమర్శించారు.

'రాజధాని ఫైల్స్'తో ప్రభుత్వానికి వణుకు

ప్రజాశక్తి - కడప అర్బన్

అమరావతి రాజధాని నేపథ్యంలో ఇటీవల విడుదలైన రాజధాని ఫైల్స్ చూసి వైసిపి ప్రభుత్వానికి వణుకు పట్టుకుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ పేర్కొన్నారు. శుక్రవారం తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైస్సార్ ప్రభుత్వం చర్యలకు అలిసిపోయిన రాజధాని రైతులు తిరిగి ప్రజాస్వామ్యపద్ధతిలో పోరాటం చేస్తుంటే వారిపైన భౌతిక దాడులు, అక్రమ కేసులు, మహిళపైనా దాడులకు పాల్పడ్డం, వారిని మానసికంగా హింసించడం వంటి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడిందని పేర్కొన్నారు. దాడులకు, బెదిరింపులకు భయపడకుండా సుమారు 1500 రోజులు వివిధ రూపాల్లో పోరాటం చేశారన్నారు. ఈ అంశాలపై సామాజిక భాద్యతతో రాజధాని ఫైల్స్ సినిమా తీస్తే ప్రభుత్వం అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై అసత్యాలతో కూడిన సినిమా దర్శకుడు రాంగోపాల్ వర్మతో చిత్రికరిస్తే ఆయన, వారి కుటుంబం ఎంత బాధపడి ఉంటారో తెలుసా అని ప్రశ్నించారు. రాజధాని సినిమా లో రైతుల వాస్తవికతను చిత్రికరిస్తే వైసిపి తట్టుకోలేకుందన్నారు. **పులివెందుల రూరల్ :** రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్ రెడ్డి వెన్నులో వణుకు పుడుతోందని జిల్లా అధికార ప్రతినిధి కంచిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఒక్క సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారని, రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచ స్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందని చెప్పారు. **జమ్మలమడుగు రూరల్ :** రాజధాని ఫైల్ సినిమాను ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని, రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టడం కాయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ సినిమాలో ఎవరిని కించపరిచేలా సన్నివేశాలు లేవన్నారు. కేవలం రాజధాని రైతుల ఆవేదనను మాత్రమే చూపించే ప్రయత్నం చేశారన్నారు. దానికే తాడేపల్లి ప్యాలెస్ వణికిపోతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, నాగరాజు, లక్ష్మయ్య, నాగార్జున, మునిస్వామి, రాజారెడ్డి, గంగాధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, సుబ్బయ్య, రాజేష్ బాబు పాల్గొన్నారు



జమ్మలమడుగు : సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

శాంతిభద్రతలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలో శాంతి భద్రతలకు ప్రాముఖ్యత ఇవ్వాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు గురుమూర్తి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం డిఎస్‌పి యశ్వంత్‌ను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజక వర్గస్థాయి ప్రతినిధుల బృందం కలిశారు. అనంతరం వారు డిఎస్‌పితో హ్యూమన్ రైట్స్‌పై మాట్లాడారు. తర్వాత డిఎస్‌పి మాట్లాడుతూ మహిళలకు, పేదలకు పోలీసు శాఖ, న్యాయశాఖ నుంచి న్యాయం జరగడానికి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుల సహకారం ఎంతో అవసరం అవుతుందన్నారు. ప్రజలు, బాధితుల వద్దకు వెళ్లి నేరుగా వారి సమస్యలు తెలుసుకుని వాటిని పోలీసులతో అధికారులతో వివరించేందుకు హ్యూమన్ రైట్స్ విభాగం ఎంతో సహాయ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షులు గురుమూర్తి యాదవ్, ఉభయ రాష్ట్రాల లీగల్ సెల్ వైస్ చైర్మన్ కుంటుమల్ల రామ్మోహన్, స్టేట్ పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ దంపెట్ల శివ నారాయణ, రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ కొత్తమాస్ భాస్కర్ బాబు, జమ్మలమడుగు ఎస్సీ సెల్ చైర్మన్ దారా ఓబులేసు, జమ్మలమడుగు కార్యదర్శి హుస్సేన్,సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి - కడప

సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక తన నివాసంలో మంజూరైన సిఎం సహాయనిధి రూ.14.37 లక్షల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు చేయడం అద్భుతమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని అన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్స్ షేక్ మహమ్మద్ షఫీ, జహీర్, త్యాగరాజు, నాయకులు రాజశేఖర్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల ఖాళీలన్నీ భర్తీ చేయాలి

కడప అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు అన్నింటిని భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా , రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్ కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఎస్బి అంజాద్ బాష కు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్ర రెడ్డికివినతి పత్రం అందజేశారు. కడప నగరంలోని క్యాంప్ కార్యాలయాలలో వారికి కలిసి మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయులు లేక రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమస్య వివరించగా ఆయన మాట్లాడుతూ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి ఉర్దూ ఉపాధ్యాయుల, పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాల సమస్యలన్నింటిని విని, ఎప్పటికప్పుడూ సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డిని రూట నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా సాహెబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ హకీం సాహెబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెపారి ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇర్షాద్ , జాకీర్ హుస్సేన్ , రాష్ట్ర అకాడమిక్ వింగ్ కన్వీనర్ షహబుద్దీన్ షేక్ , నగర అధ్యక్షులు అలీ అక్బర్ , అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, సర్దార్ మైనుద్దీన్, దానిష్ పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరండి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 18న ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించబోయే సిద్ధం సభకు పులివెందుల మునిసిపాల్టీ నుంచి ప్రతి వైసిపి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తన గృహంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కడప కీర్తిని చాటిన 'లిల్లీ'

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరానికి చెందిన బాబు రెడ్డి, సతీష్ కుమార్ నిర్మాతలుగా శివం దర్శకత్వంలో లిల్లీ చిత్రం నిర్మించారు. నిర్మాత బాబు రెడ్డి కుమార్తె బేబీ నేహా, సుబ్బారెడ్డి ప్రధాన పాత్రలో నటించారు. 2023 సంవత్సరానికి గానూ ఉత్తమ బాలల చలన చిత్రంగా లిల్లీ ఎంపికైంది. చిత్ర బృందాన్ని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జిల్లాది విడదీయరాని అనుబంధం అని లిల్లీ సినిమా మరో ఆణిముత్యం గా నిలిచిందన్నారు. బేబీ నేహా, బేబీ ప్రణీత రెడ్డి ప్రధాన పాత్రలుగా విడుదలైన ఈ చిత్రం వర్తమాన తెలుగు చలనచిత్ర రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కొనియాడారు. అతి చిన్న వయసులోనే సినీ రంగప్రవేశం చేసిన నేహా భవిష్యత్తులో కడప కీర్తిని ఇనుమడింప చేయగలదని కవి వెల్లాల వెంకటేశ్వరాచారి ఆకాంక్షించారు. అతి చిన్న వయసులోనే విశేషమైన నటనను కనబరిచిన నేహా ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచిందని యోగి వేమన విశ్వవిద్యాలయం అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ రెడ్డి శేఖర్ రెడ్డి , డాక్టర్ వెంకట రమణ చెప్పారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - వేంపల్లె

పేదల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సిఎం జగన్ రెడ్డి అమలు చేస్తున్నారని, ప్రజలందరూ మెరుగైన వైద్యం పొందాలని ఎంపిడిఓ సంపతి దివిజా అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 సందర్భంగా శుక్రవారం వేంపల్లె లోని ఒకటవ సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య కిట్లును ఎంపిడిఓ, ఎంపిపి లక్ష్మి గాయత్రీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా రోగాలతో బాధపడే రోగులకు స్పెషలిస్ట్ వైద్యుల చేత వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు చాలా ఉపయోగ పడుతుందని చెప్పారు. రోగులకు కార్పోరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపల్లె వైద్యులు స్వాతిసాయి, స్పెషలిస్ట్ వైద్యులు రమణయ్య, శ్రీనివాస్, ఇఓపిఆర్డి మల్లికార్జునరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేములను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాష్ట్రంలో నెలకొన్న వర్ష బావ పరిస్థితుల వల్ల వేముల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏడాది వర్షాభావ పరిస్థితులు లేక మండల వ్యాప్తంగా రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని సెనగ, నువ్వులు, మినుములు లాంటి పంటల ను సాగు చేశారని చెప్పారు. కానీ రైతులు సాగు చేసిన పంటలు ఐదు శాతం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కరువు ప్రాంతాలను గుర్తించి కరువు నివారణ చర్యలు చేపట్టకపోతే రైతులతో కలిసి కరువు నివారణ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా అంకురార్పణ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలో వెలసిన శ్రీ పద్మావతి సమేత కల్యాణ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి శుక్రవారం ఉదయం వేద పండితులు ఘనంగా అంకురార్పణ చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల మొదటిరోజు సూర్యప్రభావాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. 12 రోజులపాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మళ్లీ జగన్‌ను ఆదరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మళ్ళీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకుందామని జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని పి. బొమ్మేపల్లి పంచాయతీలోని బి.ఆర్ కొట్టాల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సిఎం నవరత్నాలతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్ళీ సిఎం చేసుకుంటే మరింత సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. అనంతరం గడప గడపకు మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనాథ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి దేవి, వైసీపీ నేతలు ప్రతాప్ రెడ్డి, అమర్ నాథ రెడ్డి, సత్య, శ్రీను, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక


ప్రజాశక్తి బద్వేలు

పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సింగసాని విజయభాస్కర్, సింగసాని గురురాజా ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ,యువ నాయకులు రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారిని తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువ నాయకులు రితీష్ రెడ్డి మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మాత్రమే పేద బడుగు బలహీన వర్గాలకు సరైన న్యాయం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో గురురాజా, విజయభాస్కర్, బద్వేల్ పట్టణ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, కలసపాడు మాజీ జడ్‌పిటిసి రాంభూపాల్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్‌బాష, వెంకటయ్య యాదవ్ వడ్లపూడి నాగభూషణం తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తలు జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలోకి 500 కుటుంబాలు

ప్రజాశక్తి - మైలవరం

మండల పరిధిలోని నవాబుపేట, దుగ్గనపల్లె గొల్లపల్లె, వద్దిరాల, దొడియం, భూబుసాని పల్లె గ్రామాలలోని 500 కుటుంబాలు వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు,. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా నవరత్న పథకాలను అర్హులైన ప్రతి ఇంటికి చేరడం వల్ల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వైసిపిలో చేరుతున్నారని చెప్పారు. ఇదే ఉత్సాహంతో ప్రజలందరూ మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నారని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ చైర్మన్ సంబుటూరు ప్రసాద్ రెడ్డి, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివగురివిరెడ్డి, నాయకులు శ్రీనాథ్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి